క్లుప్తంగా

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మర్రిపూడి: మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ సుధామారుతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 3వ తేదీ నుంచి 17వ తేదీలోగా పొదిలి ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. గార్లపేట(ఎస్సీ)-1, అయ్యప్పరాజుపాలెం(ఎస్టీ)-1, ధర్మవరం(బీసీ-బీ)-1 పోస్టు ఖాళీగా ఉన్నాయని వివరించారు. 2022 జూలై ఒకటో తేదీ నాటికి 21 ఏళ్లు నిండి ఉండాలని, 10వ తరగతి తప్పనిసరిగా ఉత్తీర్ణులై ఉండాలని స్పష్టం చేశారు.

మర్రిపూడి తహసీల్దార్‌గా జగదీష్‌రావు



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఖాశింపీరా

మర్రిపూడి: మండల నూతన తహసీల్దార్‌గా జి.జగదీష్‌రావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. మర్రిపూడిలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ ప్రమోషన్‌పై రెగ్యులర్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయనను ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్‌కే ఖాశింపీరా, సర్పంచ్ కదిరి భాస్కర్, ఇనుకొల్లు సుబ్బారెడ్డితోపాటు రెవెన్యూ సిబ్బంది ఘనంగా సత్కరించారు.

నేడు ఆసరా చెక్కుల పంపిణీ

గుడ్లూరు: స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో మంగళవారం పొదుపు సంఘాల మహిళలకు ఆసరా చెక్కులు పంపిణీ చేయనున్నట్లు ఇన్‌చార్జి ఏపీఎం నవీన్ తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి హాజరవుతారన్నారు. మండలంలోని పొదుపు సంఘాల మహిళలు, ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

సీఎస్‌పురం(పీసీపల్లి): వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం గంటా విద్యాసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేస్తామన్నారు. మండలంలోని పొదుపు గ్రూపుల మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండల తహసీల్దార్‌గా ఎస్.ఉషారాణి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆమె ముండ్లమూరు మండలం నుంచి బదిలీపై రాగా, ఇక్కడ పనిచేస్తున్న షేక్ నయీమ్ ముండ్లమూరుకు బదిలీపై వెళ్లారు. నూతన తహసీల్దార్‌ను రీసర్వే డీటీ రాజ్యలక్ష్మి, ఏఎస్‌ఓ సుబ్రహ్మణ్యం, సీనియర్ అసిస్టెంట్ రమణయ్య, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం

సింగరాయకొండ: మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ అమృత డిగ్రీ కాలేజీ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయ నిర్మాణానికి సోమవారం ఇద్దరు దాతలు రూ.2,01,232 విరాళంగా ఇచ్చినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ కోశాధికారి జెట్టి చంద్రశేఖర రెడ్డి తెలిపారు. మూలగుంటపాడు గ్రామానికి చెందిన చిమ్మిరి ధనలక్ష్మి, మల్లికార్జున దంపతులు రూ.1,00,116, ఉలిచి రమాదేవి, సుబ్బారెడ్డి దంపతులు రూ.1,01,116 అందజేశారని వివరించారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

పింఛన్లతో ఆర్థిక భరోసా

పామూరు: వైఎస్సార్ పెన్షన్ కానుక పేదలకుటుంబాల్లో ఆర్థిక భరోసానింపుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి అన్నారు. మండలంలోని లక్ష్మీనరసాపురంలో సోమవారం లబ్ధిదారులకు వైఎస్సార్ పెన్షన్ కానుక నగదును లబ్ధిదారులకు అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీమేరకు పెన్షన్ మొత్తాన్ని విడతల వారీగా పెంచుకుంటూ పోతున్నారన్నారు. సర్పంచ్ మన్నేపల్లి విజయ్‌శేఖర్, గాజులపల్లి వెంకటేశ్వరరెడ్డి, గట్లా విజయభాబాస్కర్‌రెడ్డి, మస్తాన్, సచివాలయ సిబ్బంది, గృహమిత్రలు పాల్గొన్నారు.

నారాయణస్వామి ఆలయ ఆదాయం రూ.1.63 లక్షలు

సీఎస్‌పురం(పీసీపల్లి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ.1,63,775 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.61,660, లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.21,495, స్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకం నిర్వహణకు దాతలు ఇచ్చిన విరాళాలు రూ.64,640, మహా ప్రాకారం నిర్మాణానికి దాతలు ఇచ్చిన విరాళాలు రూ.8,348, ఇతర విరాళాలు రూ.7,632 వచ్చినట్లు చెప్పారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు



పామూరులో పరీక్షా కేంద్రాలకు వెళుతున్న విద్యార్థులు



జరుగుమల్లి జెడ్పీ హైస్కూల్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్



హనుమంతునిపాడులో పరీక్షకు హాజరైన విద్యార్థులు



గుడ్లూరులో బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్సై



మర్రిపూడి హైస్కూల్ వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్సై అంకమ్మరావు, సిబ్బంది

కనిగిరి రూరల్: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. తొలి రోజు కావడంతో పరీక్షా సమయానికంటే గంటకు ముందే విద్యార్థుల తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు పరీక్షా కేంద్రాలకు చేరారు. పట్టణంలోని 6 కేంద్రాలతో పాటు, రూరల్‌లోని 2 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. తొలి రోజు తెలుగు పరీక్షను 1,230 మంది విద్యార్థులు రాయాల్సి ఉండగా 1,222 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. కంచర్లవారిపల్లిలోని రెండు పరీక్షా కేంద్రాలను జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి దేవిరెడ్డి రామిరెడ్డి తనిఖీ చేశారు. పట్టణంలోని పరీక్షా కేంద్రాలను సీఐ శివరామకృష్ణారెడ్డి, ఎస్సై దాసరి ప్రసాద్‌లు వేర్వేరుగా తనిఖీలు చేశారు.

పామూరు: మండలంలో 5 కేంద్రాల్లో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు 715 మంది హాజరు కావాల్సి ఉండగా ఐదుగురు గైర్హాజరయ్యారు. పరీక్షలను డీఓలు పీవీకే నాగేశ్వరరావు, ఎస్.కాలేషావలి, షేక్.షరీఫ్, యం.శివప్రసాద్, కె.చిరంజీవి, చీఫ్ సూపరింటెండెంట్‌లు బి.డేవిడ్, జి.నాగేశ్వరరావు, ఎస్.వెంకటేశ్వర్లు, సయ్యద్ ఇసాక్, కే.సుబ్బారెడ్డిలు పర్యవేక్షించగా..ఎంఈఓ ఎస్.రవీంద్రనాథ్ తనిఖీ చేశారు.

వెలిగండ్ల: పదో తరగతి పరీక్షలు తొలి రోజు ప్రశాంతంగా జరిగాయి. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో రెండు సెంటర్లు, కస్తూరిబా పాఠశాలలో ఒక సెంటర్‌లో పది పరీక్షలు జరిగాయి. ఏ సెంటర్‌లో ఒక విద్యార్థి పరీక్షకు గైర్హాజరు కాగా మొత్తం 376 మంది పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షల్లో ఎలాంటి కాపీయింగ్ జరగకుండా చీఫ్‌లు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఎస్సై మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేశారు.

హనుమంతునిపాడు: మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మహమ్మదాపురం పరీక్షా కేంద్రంలో 136 మంది విద్యార్థులు హాజర్ కావాల్సి ఉండగా ఒకరు గైర్హాజరు కాగా, హనుమంతునిపాడు కేంద్రంలో 170 మందికి గాను ఒకరు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎస్సై జి.క్రిష్ణపావని 144 సెక్షన్ ఏర్పాటు చేశారు. కేంద్రాల వద్ద పోలీసు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

పీసీపల్లి(సీఎస్‌పురం): పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 210 మందికి 208 మంది, రత్నం జూనియర్ కాలేజీలో 133 మందికి 133 మందికి పరీక్షలు రాశారు.

గుడ్లూరు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం గుడ్లూరులోని రెండు పరీక్షా కేంద్రాల్లో తొలి రోజు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులను వారి తల్లిదండ్రులు కేంద్రాల వద్దకు తీసుకువచ్చారు. దీంతో కేంద్రాల వద్ద కోలాహలం నెలకొంది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 151 మంది విద్యార్థులకు గాను 149 మంది, చైతన్య పాఠశాలలో 173 మందికి గాను 171 మంది తెలుగు పరీక్షకు హాజరైనట్లు రెండు కేంద్రాల చీఫ్‌లు జాన్, వెంకటేశ్వర్లు తెలిపారు. మొత్తం 324 మంది విద్యార్థులకు గాను 320 మంది హాజరు కాగా నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఎస్సై ప్రసాద్, ఏఎస్సై మురళీధర్‌లు సిబ్బందితో రెండు కేంద్రాలు వద్ద పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

కందుకూరు రూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 211 మంది, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 218 మందికి గాను ఒకరు గైర్హాజరయ్యారు. శ్రీ గాయత్రి డిగ్రీ కళాశాలలో 130 మందికి గాను ఒకరు గైర్హాజరయ్యారు. టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 107 మంది, శ్రీ చైతన్య హైస్కూల్‌లో 110 మంది, సిద్దార్థ హైస్కూల్‌లో 140 మందికి ఒకరు గైర్హాజరయ్యారు. సంస్కృతి స్కూల్‌లో 140 మంది, శ్రీ శివసాయి స్కూల్‌లో 110 మంది, విజ్ఞాన్ విహార్ స్కూల్‌లో 103 మంది పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు.

తొలిరోజు ప్రశాంతం

సింగరాయకొండ: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. సింగరాయకొండ మండలంలో నాలుగు సెంటర్లలో మొత్తం 800 మంది విద్యార్థులకుగాను 797 మంది హాజరైనట్లు ఎంఈఓ బి.శివన్నారాయణ తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద సీఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్సై షేక్ ఫిరోజ్‌ఫాతిమా బందోబస్తును పర్యవేక్షించారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని బాలికల ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థులను సీఐ తనిఖీ చేసి లోపలికి పంపించారు. బాలికల ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని పరీక్షల రాష్ట్ర పరిశీలకుడు ఆర్ఎంకే ప్రసన్నకుమార్ తనిఖీ చేశారు. విద్యార్థులు ప్రైవేట్ స్కూల్ యూనిఫాం ధరించి పరీక్షకు హాజరు కావడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. యూనిఫాంలో వచ్చిన వారిని ఈసారి అనుమతించవద్దని సిబ్బందిని ఆదేశించారు.

జరుగుమల్లి: మండలంలో పదో తరగతి పరీక్షలకు 375 మంది హాజరు కావాల్సి ఉండగా నలుగురు గైర్హాజరైనట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి మర్రిబోయిన శ్రీనివాసరావు తెలిపారు. జరుగుమల్లి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల కేంద్రాన్ని సోమవారం తహసీల్దార్ ఎస్ ఉషారాణి తనిఖీ చేశారు.

మర్రిపూడి: మండలంలోని 3 కేంద్రాల్లో 358 మంది విద్యార్థులకుగాను 357 మంది పరీక్షకు హాజరైనట్లు ఎంఈఓ ఈవీ రంగయ్య సోమవారం తెలిపారు. ఎస్సై పి.అంకమ్మరావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. మర్రిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి శ్రీనివాసులు తనిఖీ చేశారు.

పొన్నలూరు: మండల కేంద్రంలో పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, రాష్ట్ర పరిశీలకుడు ఎంఆర్ ప్రవీణ్‌కుమార్ తనిఖీ చేశారు. స్థానిక ఎస్సై డి రాజారావు, సిబ్బందికి ఏఆర్ ఏఎస్పీ సూచనలిచ్చారు. మొదటి రోజు తెలుగు పరీక్షకు 359 మంది విద్యార్థులు హాజరయ్యారు.

టంగుటూరు: టంగుటూరు మండలంలో 4 కేంద్రాల్లో 527 మందికిగాను 522 మంది హాజరైనట్లు ఎంఈఓ చెంచుపున్నయ్య తెలిపారు. ఎస్సై ఖాదర్‌బాషా, సిబ్బంది విద్యార్థులను తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు.



కనిగిరిలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు



టంగుటూరులో విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఎస్సై ఖాదర్‌బాషా



సింగరాయకొండ: విద్యార్థులను తనిఖీ చేస్తున్న సీఐ రంగనాథ్



పొన్నలూరులో కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏఆర్ ఎస్పీ అశోక్‌బాబు

అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలి



విద్యుత్ అధికారులను నిలదీస్తున్న ప్రజాప్రతినిధులు

హనుమంతునిపాడు: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీపీ గాయం సావిత్రి అధికారులను హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గాయం సావిత్రి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. రైతులు విద్యుత్ సమస్యపై ఫోన్ చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఎంపీటీసీ తానిగుండాల తిరుపతిరెడ్డి, సర్పంచ్ సానిమ్ము మధుసూదన్‌యాదవ్‌లు ప్రశ్నించారు. తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని చెప్పినా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోవడం లేదని ఎంపీటీసీ ఉడుముల సుబ్బారెడ్డి, తిరుపతిరెడ్డి, బెంజ్‌మెన్‌లు ఏఈ శ్రీకాంత్‌ను నిలదీశారు. పట్టాదార్ పాస్ పుస్తకాలు ఏడాది దాటినా ఎందుకు రాలేదని గాయంవారిపల్లి సర్పంచ్ గాయం రామక్రిష్ణారెడ్డి తహసీల్దార్ హరిబాబును అడిగారు. ఈ సందర్భంగా ఎంపీపీ గాయం సావిత్రి మాట్లాడుతూ సంక్షేమ పథకాలను అర్హులకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యలను వెంటనే పరిష్కరించేలా అధికారులు పనిచేయాలన్నారు. ఎంపీడీఓ జీవీ క్రిష్ణారావు,తహసీల్దార్ ఎస్.హరిబాబు, వైస్ ఎంపీపీ కొదమల బెంజిమేన్, వైఎస్ ఎంపీపీ రుద్రపాటి శోభ, కో ఆప్షన్ సభ్యుడు షేక్ నాసరవలి, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు. తొలుత మాజీ ఎంపీటీసీ కోటపాటి వసుందరమ్మ మృతికి సంతాపం ప్రకటించారు.

పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలి



అంగన్‌వాడీ కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

లింగసముద్రం: ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని ఎంపీడీఓ శేషుబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కేంద్రాలు సక్రమంగా నిర్వహించని అంగన్‌వాడీ కార్యకర్తలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో 45 అంగన్‌వాడీ కేంద్రాల్లో 7 కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయని, వీటికి కూడా శాశ్వత భవనాలు నిర్మించేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు.

కందుకూరు రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందజేస్తామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభావతి అన్నారు. మండలంలోని మాచవరం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పొట్లూరి లలిత, ఏఎన్ఎం మంజుల, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

కందుకూరు అర్బన్: పోషణ పక్వాడ కార్యక్రమాలు 15 రోజుల పాటు విజయవంతంగా నిర్వహించినట్లు సీడీపీఓ శర్మిష్ఠ తెలిపారు. మున్సిపాలిటీలోని పోతురాజుమిట్ట అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ ముగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పోషణ లోపం లేకుండా ఉండేందుకు ప్రభుత్వం పోషణ ఆహారంపై అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. గర్భిణులు, బాలింతలు చిరుధాన్యాలు తీసుకోవడం వల్ల రక్తహీనత లేకుండా ఉంటుందన్నారు. సూపర్‌వైజర్ అంజమ్మ, నూర్జహాన్, సతున్, బేగం, రహ్మతున్నీసా, నసీమ, బేబి, ఝాన్సీ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వైఎస్సార్ బీమా వరం



నగదును అందచేస్తున్న చైర్మన్ గఫార్, వైస్ చైర్మన్ మాణిక్యరావు

కనిగిరి రూరల్: పేదలకు వైఎస్సార్ బీమా వరంలాంటిదని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 15వ వార్డులో మృతి చెందిన సూరజ్ కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేల నగదును వైఎస్సార్ బీమా పథకం కింద అందచేశారు. ఈ సందర్భంగా చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ పార్టీలకతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మాణిక్యరావు, మెప్మా టీఎంసీ రఘు, వార్డు వలంటీర్లు పాల్గొన్నారు. అలాగే సమస్య పరిష్కారంలో భాగంగా పట్టణంలోని 1వ వార్డులో చైర్మన్ గఫార్ పర్యటించారు. పరిసరాల పరిశుభ్రతపై మున్సిపల్, సచివాలయ సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. స్థానిక నాయకులు చిన్నిగారి కొండలు, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్న కేశవులు తదితరులు పాల్గొన్నారు. మొబైల్ వాహనంలో రేషన్ పంపిణీని చైర్మన్ గఫార్ పరిశీలించారు. బియ్యం పంపిణీలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ప్రతి కార్డుదారునికి రేషన్ ఇవ్వాలని ఆదేశించారు.

820 పొగాకు బేళ్లు కొనుగోలు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి సోమవారం కమ్మవారిపాలెం, కట్టుబడిపాలెం గ్రామాల రైతులు 872 బేళ్లు తీసుకురాగా 820 కొనుగోలయ్యాయి. గరిష్ఠ ధర కేజీ రూ.200, కనిష్ఠ ధర రూ.160, సరాసరి ధర రూ.160.13 ధర పలికింది. వేలంలో మొత్తం 15 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు

హనుమంతునిపాడు: గ్రామాల్లో జూదం, నాటుసారా, బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై జి.కృష్ణపావని అన్నారు. స్థానిక వేములపాడు సెంటర్‌లో సోమవారం ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

సింగరాయకొండ: మండల కేంద్రంలో గత రెండు రోజులుగా శానంపూడి రక్షిత మంచినీటి పథకం నుంచి తాగునీటి సరఫరా ఆగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రెండు రోజుల క్రితం వచ్చిన ఈదురు గాలులకు విద్యుత్ సమస్య తలెత్తి విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో సర్పంచ్ తాటిపర్తి వనజ సూచన మేరకు సోమవారం పంచాయతీ సిబ్బంది చిల్లచెట్లను తొలగించి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. విద్యుత్ శాఖ ఏఈ సాంబశివరావు, జాన్‌కిషోర్, ప్రణయ్ ఉన్నారు.

5న కరేడులో జగ్జీవన్‌రామ్ జయంతి సభ

ఉలవపాడు: మండల పరిధిలోని కరేడులో ఈ నెల 5న జగ్జీవన్‌రామ్ 115వ జయంతి సభ నిర్వహించనున్నట్లు మహాజన సోషలిస్టు పార్టీ మండల అధ్యక్షుడు ముత్తు ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు జరిగే కార్యక్రమానికి ప్రముఖ రచయిత బద్దిపూడి జయరావు హాజరవుతారని తెలిపారు.

సోనా బోట్ల సమాచారం తెలియజేయండి



మాట్లాడుతున్న మత్స్యశాఖాధికారి వర్షిణి

సింగరాయకొండ: తమిళనాడు రాష్ట్రానికి చెందిన సోనా బోట్లు తీరానికి సమీపంలోకి వస్తే వెంటనే సమాచారం అందించాలని మండల మత్స్యశాఖ అధికారి ఎస్‌వీఎస్ వర్షిణి పాకల పోతయ్యగారి పట్టపుపాలెం మత్స్యకారులకు సూచించారు. పాకల సముద్రతీర ప్రాంతాన్ని సోమవారం ఉదయం ఆమె పరిశీలించారు. మత్స్యకార సంఘ నాయకుడు ప్రళయకావేరి రోశయ్య మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో సోనా బోట్లు తీరానికి దగ్గరగా వస్తున్నాయని, సోమవారం ఉదయం కూడా వచ్చాయని తెలిపారు. మత్స్యశాఖాధికారి సూచన మేరకు స్థానిక మత్స్యకారులు బోట్లు సిద్ధం చేయగా.. తీరంలో పరిస్థితిని గమనించిన తమిళ జాలర్లు దూరంగా వేటాడుకుంటూ వెళ్లిపోయారు.

సాగుబడి విస్తీర్ణం తెలియజేయండి

లింగసముద్రం: మండలంలో సాగు చేసిన పంటల విస్తీర్ణాన్ని రెవెన్యూ, వ్యవసాయ, ఇరిగేషన్‌శాఖ సమన్వయంతో కలిసి తెలియజేయాలని తహసీల్దార్ సుధాకరరావు చెప్పారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మూడు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న పంటల విస్తీర్ణాన్ని రెవెన్యూ, ఇరిగేషన్, వ్యవసాయశాఖ అధికారులు పర్యటించి వివరాలు సేకరించి నివేదక తయారు చేయాలన్నారు. ఏఓ అబ్రహంలింకన్, రాళ్లపాడు ప్రాజెక్టు జేఈ పూర్ణచంద్రరావు, ఆర్ఐ హనుమాయమ్మ, ఏఎస్ఓ, వీఏఏలు పాల్గొన్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

ఉలవపాడు: సముద్రంలో గల్లంతైన యువకుడి మృతదేహం సోమవారం లభ్యమైంది. కరేడు బీచ్ సమీపంలో గల్లంతయిన సింగరాయకొండకు చెందిన ఉమ్మడిశెట్టి జాలమహేష్ (23) మృతదేహం సోమవారం ఉదయం తీరానికి కొట్టుకువచ్చింది. మృతదేహాన్ని ఉలవపాడు సీహెచ్‌సీ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కరేడు తీరంలో లభ్యమైన మృతదేహం

భక్తిశ్రద్ధలతో అంకాళమ్మ, పోలేరమ్మ తిరునాళ్ల



గ్రామ దేవతలకు పూజలు చేస్తున్న కదిరి బాబూరావు

సీఎస్‌పురం(పీసీపల్లి): మండలంలోని శీలంవారిపల్లిలో గ్రామ దేవతలు అంకాలమ్మ పోలేరమ్మ తిరునాళ్ల సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలో శ్రీరామనవమి ఉత్సవాలు ముగిసిన అనంతరం గ్రామ దేవతలకు తిరునాళ్ల చేస్తుంటారు. ఇందులో భాగంగా సోమవారం గ్రామ దేవతలకు తిరునాళ్ల నిర్వహించారు. వైఎస్సార్ సీపీ కావలి నియోజకవర్గ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు ఉత్సవాలలో పాల్గొని గ్రామ దేవతలకు పూజలు చేశారు. ఆలయ పూజారులు కదిరి బాబూరావును శేష వస్త్రాలతో సత్కరించారు. కేబీఆర్ వ్యవసాయ కళాశాల చైర్మన్ కదిరి ప్రకాశరావు, సెక్రటరీ కదిరి పార్థసారథి, కదిరి భువనేష్, కదిరి రాజేష్, వరికుంటపాడు మాజీ ఎంపీటీసీ సుంకరి వెంకటాద్రి, ఇరగని చలపతిరావు, మాజీ ఎంపీటీసీ మునగల వెంకటనారాయణరెడ్డి, మూరం కాశిరెడ్డి, కొట్టే శ్రీనివాసులు, దుగ్గని రోశయ్య పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



నియామక పత్రం అందజేస్తున్న ఎంపీపీ సావిత్రి

హనుమంతునిపాడు: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాల్సిన బాధ్యత వలంటీర్లదేనని ఎంపీపీ గాయం సావిత్రి అన్నారు. తిమ్మారెడ్డిపల్లిలో క్లస్టర్ వలంటీర్‌కు సోమవారం నియామకపత్రాన్ని అందజేశారు. ఎంపీడీఓ జీవీ. క్రిష్ణారావు, మండల పార్టీ కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి, వైస్ ఎంపీపీలు బెంజి, ఆరో శోభ, మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, గృహసారథుల కన్వీనర్ ఎం తిరుపతయ్య, సర్పంచుల సంఘ అధ్యక్షుడు సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, రైతు సంఘ అధ్యక్షుడు శ్యామల సాంబిరెడ్డి, కలుకూరి చిన్న, ఎంపీటీసీ సుబ్బారెడ్డి, కె.దశరథ, ఆలా శివ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలి



పొన్నలూరులో మాట్లాడుతున్న జేసీఎస్ కన్వీనర్ తిరుపతిరెడ్డి

పొన్నలూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని జేసీఎస్ మండల కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. పొన్నలూరులో సోమవారం సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 7వ తేదీ నుంచి 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు వలంటీర్లతో సమన్వయం చేసుకుని ప్రభుత్వం నుంచి అందుతున్న ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజలకు వివరించాలని చెప్పారు. నాటి టీడీపీ పాలనను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధితో పోల్చి ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.